
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు
శుక్రవారం 26 జనవరి 2024



## సీఎం జగన్ విశాఖ రాక రేపు



విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): భీమిలి నియోజకవర్గం పరిధిలోని సంగివలస వద్ద వైసీపీ నిర్వహించే ఉత్తరాంధ్ర సదస్సులో పాల్గొనేందుకు సీఎం జగన్ శనివారం విశాఖ రానున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఆయన విశాఖ విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టర్‌లో సంగివలసలోని ఎన్‌ఆర్‌ఐ కాలేజీ సమీపంలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 3.30 గంటల నుంచి ఐదు గంటల వరకు సదస్సులో పాల్గొని తిరిగి హెలికాప్టర్‌లో విమానాశ్రయానికి వచ్చి విమానంలో విజయవాడ వెళతారు.

## పర్యాటక టెండర్లు రద్దు చేయండి

**ప్రభుత్వానికి ఈఏఎస్ శర్మ లేఖ**

**ఏజెన్సీలో ప్రాజెక్టులు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం పీసా చట్టం ప్రకారం చెల్లదు**

**విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):** ఏజెన్సీలో పర్యాటక ప్రాజెక్టులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం పీసా చట్టం ప్రకారం చెల్లదని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి గురువారం లేఖ రాశారు. గిరిజన ప్రాంతాల్లో పర్యాటక ప్రాజెక్టులను టెండర్ల ద్వారా ప్రైవేటు వ్యక్తులు/సంస్థలకు కట్టబెట్టాలంటే ముందుగా గిరిజన గ్రామసభల నుంచి అనుమతి తీసుకోవాలని ఆ లేఖలో పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యాటక ప్రాజెక్టులకు టెండర్లు ఆహ్వానించేందుకు గ్రామ సభల నుంచి అనుమతి తీసుకోలేదని గుర్తుచేశారు. ఇంకా సమతా కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన అంశాలను ఉల్లంఘించారన్నారు. ఈ నేపథ్యంలో టెండర్ నోటీసులు వెంటనే రద్దు చేయాలని ఆయనడిమాండ్ చేశారు.

# జన్‌మన్.. ఆదిమ గిరిజనుల దశ తిరిగేన్



**కేంద్ర ప్రభుత్వ పథకంతో మారనున్న గ్రామాల రూపురేఖలు**

**ఏజెన్సీ వ్యాప్తంగా 1,597 గ్రామాల్లో లక్షా 81 వేల మంది ఆదిమ గిరిజనులు**

**కేంద్రం నిధులతో వారి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు**

**సంకాంత్రి నాడు వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ**

**ఇళ్ల నిర్మాణానికి అధికారుల చర్యలు**

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

మన్యంలో అత్యంత వెనుకబాటుకు గురైన ఆదిమ జాతి గిరిజనుల అభివృద్ధికి కేంద్రం పెద్దపీట వేస్తున్నది. ఇందులో భాగంగా ఏజెన్సీలో ఉన్న ఆదిమ జాతి గిరిజనుల వ్యక్తిగత, సామాజిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టడంలో భాగంగా ప్రధానమంత్రి జన్‌మన్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆ పథకాన్ని ఈ ఏడాది సంక్రాంతి పండుగ నాడు దేశ ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా అదే రోజు జిల్లాలో అరకులోయ మండలం కొత్తభల్లుగుడ గ్రామంలో ఆదిమ జాతి గిరిజనులతో ప్రధాని మోదీ వర్చువల్‌గా మాట్లాడి వారి స్థితిగతులను అడిగితెలుసుకున్నారు. జన్‌మన్‌తో ఆదిమజాతి గిరిజనుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు.





జి.మాడుగుల మండలం కొత్తూరుపాడు ఆదిమ జాతి గిరిజన గ్రామం

### మన్యంలో ఆదిమ జాతి గిరిజనుల వివరాలు

| వ.సం. | మండలం | గ్రామాలు | కుటుంబాలు | జనాభా |
|---|---|---|---|---|
| 1. | అనంతగిరి | 75 | 1,593 | 5,382 |
| 2. | అరకులోయ | 94 | 3,012 | 11,557 |
| 3. | చింతపల్లి | 248 | 9,040 | 35,576 |
| 4, | డుంబ్రిగుడ | 71 | 1,781 | 7.513 |
| 5. | జీకేవీధి | 209 | 5,304 | 21,112 |
| 6. | జి.మాడుగుల | 211 | 4,984 | 22,142 |
| 7. | హుకుంపేట | 88 | 2,638 | 10,933 |
| 8. | కొయ్యూరు | 95 | 2,488 | 9,031 |
| 9. | ముంచంగిపుట్టు | 244 | 7,850 | 27,351 |
| 10. | పాడేరు | 101 | 2,949 | 11,148 |
| 11. | పెదబయలు | 161 | 5,170 | 19,837 |
| | మొత్తం | 1,597 | 46,809 | 1,81,582 |

**గతేడాది నుంచి ఐటీడీఏ అధికారులు కసరత్తు**

కేంద్ర ప్రభుత్వం పీఎం జన్‌మన్ పథకాన్ని ప్రారంభించడానికి ఏడాది ముందు నుంచి దానిపై ఐటీడీఏ అధికారులు కసరత్తు చేపట్టారు. ఏజెన్సీ 11 మండలాల్లో ఏడు లక్షల మంది గిరిజనులు ఉండగా, వారిలో ఆదిమ జాతి గిరిజనులైన కోందు, పొరజ, గదబ తెగలకు చెందిన వారు లక్షా 81 వేల 582 మంది వున్నారని గుర్తించారు. దీంతో ఐటీడీఏ పరిధిలో ఉన్న ఆదిమ జాతి గిరిజనులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి, వారి తాజా స్థితిగతులు, జీవన విధానం, వారి సమస్యలు, అవసరాలు, వారి భవిష్యత్తును మరింతగా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన చర్యలు, తదితర అంశాలపై ఐటీడీఏ అధికారులు క్షేత్ర స్థాయి నివేదికలను రూపొందించారు. ఆయా నివేదికలను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. దీంతో ఐటీడీఏ పరిధిలోని ఆదిమ జాతి గిరిజనుల మొత్తం స్థితిగతులు, వారి భవిష్యత్తుకు చేపట్టాల్సిన చర్యలు, అందుకు అవసరమైన నిధులు, తదితర అంశాలపై కేంద్రానికి ఒక స్పష్టత ఇచ్చారు.

**'జన్‌మన్'లో గృహ నిర్మాణానికి తొలి ప్రాధాన్యం**

ప్రధాన మంత్రి జన్‌మన్ పథకంలో ఆదిమ జాతి గిరిజనులకు సొంతింటి నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఐటీడీఏ అధికారులు నిర్వహించిన సర్వే ఆధారంగా 24 వేల కుటుంబాలకు ఇల్లు లేవని గుర్తించి, మంజూరు చేశారు. తొలి విడతగా అందులో 6,606 కుటుంబాలకు ఇళ్లను నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఒక్కో ఇంటి లబ్ధిదారునికి రూ.70 వేలు చొప్పున వారి వ్యక్తిగత ఖాతాలో సొమ్ము జమ చేశారు. ఇలా దశల వారీగా లబ్ధిదారులందరికీ ఇంటి నిర్మాణానికి రూ.2 లక్షల 39 వేలు అందిస్తారు. కాగా ఆదిమ జాతి గిరిజనులు నివసించే పెద్ద గ్రామాల్లో మల్టీపర్పస్ హాళ్లను నిర్మించాలని నిర్ణయించారు. ఒక్కో మల్టీపర్పస్ హాల్‌లో పాఠశాల, అంగన్‌వాడీ, ఆరోగ్య ... మిగతా 8వ పేజీలో



లంబసింగిలో మంచు

## మళ్లీ పెరిగిన చలి

**కొనసాగుతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు**

**అరకులోయలో 12.4, పాడేరులో 13.1 డిగ్రీలు**



పాడేరులో గురువారం ఉదయం పొగ మంచు

**పాడేరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):** మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. దీంతో పొగమంచు, చలి ప్రభావానికి ఏజెన్సీ వాసులు వణుకుతున్నారు. అరకులోయలో 12.4, పాడేరులో 13.1, జి.మాడుగులలో 13.3, జీకేవీధిలో 14, పెదబయలులో 14.1, అనంతగిరిలో 14.4, ముంచంగిపుట్టులో 14.5 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు గురువారం నమోదయ్యాయి. గత 24 గంటలతో పోలిస్తే కనిష్ఠ ఉష్ణోగ్రతలు కాస్త దిగజారాయి. ప్రస్తుత శీతాకాలం కావడంతో పాటు ఉత్తరాది నుంచి చలిగాలులు వీస్తుండడంతో చలి తీవ్రత కొనసాగుతున్నది. ఏజెన్సీలో తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకు దట్టంగా పొగ మంచు కమ్మేస్తుంది. దీంతో లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా చలి వేస్తుండగా, రాత్రి వేళల్లో తీవ్రత అధికంగా ఉంటున్నది. దీంతో మన్యం వాసులు మంటలు కాగుతూ, ఉన్ని దుస్తులు ధరిస్తూ చలి నుంచి రక్షణ పొందుతున్నారు.

**చింతపల్లిలో..**

**చింతపల్లి:** ఏజెన్సీ వ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదు కావడం వల్ల చలి తీవ్రత తగ్గడంలేదు. గురువారం చింతపల్లిలో 14.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల ప్రభావం వల్ల గిరిజన గ్రామాల్లో చలి తీవ్రత అధికంగా వున్నది. చలితో పాటు మంచు అధికంగా కురుస్తున్నది. ఉదయం పదిగంటల వరకు చింతపల్లి, జీకేవీధి, లంబసింగి ప్రాంతాల్లో మంచు వీడంలేదు. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

**ముంచంగిపుట్టులో..**

**ముంచంగిపుట్టు:** మండల పరిధిలో చలి తీవ్రత కొనసాగుతోంది. గురువారం ఉదయం 8 గంటల వరకు మంచు తెరలు వీడలేదు. సాయంత్రం నాలుగు గంటల నుంచి మళ్లీ చలి మొదలైంది. సాయంత్రమైతే వీధుల్లో చలి మంటలు కాగుతూ జనం కనిపిస్తున్నారు.



పాడేరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

## సమస్యలపై పింఛనర్ల ఆందోళన

- తక్షణమే పరిష్కరించాలని పాడేరు, చింతపల్లిలో నిరసన
- తహసీల్దార్లకు వినతి పత్రాల సమర్పణ

**పాడేరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):** అపరిష్కృత సమస్యలపై విశ్రాంత ఉద్యోగులు సైతం రోడ్డెక్కాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇన్నాళ్లు ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ సమస్యలపై నిరసనలు, ధర్నాలు చేపట్టగా తాజాగా విశ్రాంత ఉద్యోగులు సైతం అదే బాట పట్టారు. ఆంధ్రప్రదేశ్ పెన్షనర్ల సంఘం పిలుపు మేరకు గురువారం ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం ముందు వారంతా ధర్నా చేపట్టారు. సంఘం డివిజన్ అధ్యక్షుడు రొబ్బా నాగభూషణరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్ అందించాలని, ఇతర ... మిగతా 8వ పేజీలో



## ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం




పాడేరులో ఓటరు ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ కె.కార్తిక్. (ఇన్‌సెట్లో) సీనియర్ సిటిజన్లను సత్కరించిన దృశ్యం



జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జేసీ కె.కార్తిక్ మాట్లాడుతూ ఓటు హక్కును అందరూ వినియోగించుకోవాలన్నారు. అనంతరం సీనియర్ ఓటర్లను ఘనంగా సత్కరించారు. కొత్త ఓటర్లకు కార్డులు పంపిణీ చేశారు. ఓటు వినియోగంపై అవగాహన కల్పించడంలో భాగంగా మానవ హారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వీవీ రమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పి.అంబేడ్కర్, పి.మురళీకృష్ణ, వీవీఎస్ శర్మ, స్థానిక తహసీల్దార్ వి.త్రినాథరావునాయుడు, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

-పాడేరు/ఆంధ్రజ్యోతి

## రాగల మూడు రోజుల్లో చిరుజల్లులు

**చింతపల్లి, జనవరి 25:** జిల్లా వ్యాప్తంగా రాగల మూడు రోజుల్లో చిరుజల్లులతో కూడిన వర్షం కురుస్తుందని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు గురువారం ప్రకటించారు. అరకు, పాడేరు, చింతపల్లి, రంపచోడవరం డివిజన్ల పరిధిలో శుక్ర, శని, ఆదివారాలు కనిష్ఠంగా 0.5 ఎంఎం, గరిష్ఠంగా 4.8 ఎంఎం వర్షపాతం నమోదవుతుందన్నారు. గాలిలో తేమ 98 శాతం ఉంటుందన్నారు. నూర్పు చేసుకున్న వరి, మిరియాలు, కాఫీ.. వర్షాలకు తడిసిపోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు తెలిపారు.

## మన్యంలో 264 సెల్ టవర్లు ప్రారంభం

**వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం జగన్**

**పాడేరు మండలం ఈదులపాలెం, డుంబ్రిగుడ మండలం లైగండలో ప్రత్యేక కార్యక్రమాలు**



సెల్ టవర్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్‌సిన్హా, సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, వైసీపీ సమన్వయకర్త విశ్వేశ్వరరాజు

**పాడేరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):** ఏజెన్సీలో నిర్మాణం పూర్తి చేసుకున్న 264 సెల్ టవర్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం తన క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఏజెన్సీలో సమాచార వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా రెండు వేలకు పైగా సెల్ టవర్ల నిర్మాణం జరుగుతున్నది. ఇందులో భాగంగా నిర్మాణం పూర్తి చేసుకున్న 100 సెల్ టవర్లను గతేడాది జూన్‌లో సీఎం జగన్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు.

ప్రస్తుతం నిర్మాణం పూర్తయిన 264 సెల్ టవర్లను సీఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి వర్చువల్‌గా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో డుంబ్రిగుడ మండలం లైగండ పంచాయతీ కేంద్రంలో, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధి పాడేరు మండలం సలుగు పంచాయతీ ఈదులపాలెంలో జిల్లా అధికారులు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈదులపాలెంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్‌సిన్హా, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొని సెల్ టవర్ల ప్రారంభోత్సవ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో సెల్ టవర్ల ఏర్పాటుతో సమాచార వ్యవస్థ అభివృద్ధి చెందడంతో పాటు గిరిజనులకు సమాచార సేవలు అందుబాటులో వస్తున్నాయన్నారు. రానున్న రోజుల్లో జిల్లా మారుమూల ప్రాంతాల్లో సైతం సెల్ సేవలు సంపూర్ణంగా అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పాడేరు ... మిగతా 8వ పేజీలో



లైగండ పంచాయతీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఫాల్గుణ, ఐటీడీఏ పీవో అభిషేక్, జాయింట్ కలెక్టర్ కార్తిక్, జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ప్రజాప్రతినిధులు



పీటీడీ ఉద్యోగులకు ఉన్ని దుస్తులు అందిస్తున్న చైర్మన్ మల్లికార్జునరెడ్డి

## పాడేరు డిపోనకు 25 కొత్త బస్సులు

**నెల రోజుల్లో ఇచ్చేందుకు చర్యలు**

**కాంప్లెక్స్ ఆధునికీకరణకు కృషి**

**పీటీడీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి**

**పాడేరురూరల్, జనవరి 25:** పాడేరు డిపోనకు నెల రోజుల్లో 25 కొత్త బస్సులను ఇవ్వనున్నామని ప్రజా రవాణా శాఖ(పీటీడీ) చైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డి తెలిపారు. గురువారం ఆయన పాడేరు డిపోను సందర్శించారు. డిపోలో మొక్కను నాటిన అనంతరం అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడేరు పీటీడీ కాంప్లెక్స్ ఆధునికీకరణకు చర్యలు చేపడతామన్నారు. డిపో కార్మికుల క్వార్టర్స్ మరమ్మతులు చేయించడంతో పాటు అదనపు భవన నిర్మాణానికి రూ.20 లక్షలు, సిబ్బంది విశ్రాంతి గది నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేశామన్నారు. డిపోలోని 187 మంది ఉద్యోగులు, కార్మికులకు ఉన్ని స్వెటర్లు, మంకీ క్యాప్‌లు, గ్లౌజులు అందజేశారు. ఉత్తమ ఉద్యోగులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. సమస్యలపై ఎన్‌ఎంయూ నాయకులు, డిపో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఇచ్చిన వినతులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. అనంతరం చైర్మన్‌ను డిపో ఉద్యోగులు, యూనియన్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈడీ సి.రవికుమార్, డిప్యూటీ సీటీఎం బి.అప్పలనాయుడు, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ దుర్గాప్రసాద్, డీపీటీవో వి.శ్రీనివాస్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ అధికారి కేవీఎస్ఎన్.రాజు, సిస్టం సూపర్‌వైజర్ బీఆర్‌వీ ప్రసాద్, ఎస్‌డీఐ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే వల్లీ, యూనియన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

**పాడేరు తలారిసింగి ఆశ్రమ పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహణ**



వేడుకల్లో పాల్గొనే శకటాలను గురువారం రాత్రి పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

**పాడేరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):** జిల్లా కేంద్రం పాడేరులో గణతంత్ర వేడుకలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పాడేరు కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడిన తరువాత నిర్వహించే రెండో ఏడాది గణతంత్ర వేడుకలు కావడంతో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఏర్పాట్లు చేశారు. స్థానిక తలారిసింగి ఆశ్రమ పాఠశాల క్రీడా మైదానంలో గణతంత్ర వేడుకలను నిర్వహించేందుకు వేదిక, ప్రభుత్వ పథకాలపై స్టాళ్లు, శకటాల ప్రదర్శనకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా వందనం చేసి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. ముఖ్య అతిథి ప్రసంగం అనంతరం స్టాళ్లు, శకటాల ప్రదర్శన, విద్యార్థుల దేశభక్తి ప్రదర్శనలు, ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాల పంపిణీతో కార్యక్రమం ముగుస్తుంది. ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశాలతో భద్రతా చర్యలు చేపట్టారు. ఐటీడీఏ పీవో వి.అభిషేక్ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. గణతంత్ర వేడుకలు నిర్వహించే ప్రదేశానికి ఆయన గురువారం చేరుకుని ఏర్పాట్లపై ఆరా తీశారు. అధికారులతో మాట్లాడి వివిధ ఏర్పాట్లు, శకటాలు, తదితర వాటిని పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూ డీడీ కొండలరావు, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ డీవీఆర్ఎం.రాజు, డీఈఈ పి.అనుదీప్, ఏఈఈ బి.దేముళ్లు, తదితరులు పాల్గొన్నారు.



పాడేరులో గణతంత్ర వేడుకలకు జరుగుతున్న ఏర్పాట్లు

క్రైం... crime news

## యువతిపై గ్రామ వలంటీర్ అత్యాచారయత్నం

- విషయం బయటకు చెబితే సంక్షేమ పథకాలు ఆపేస్తానని బెదిరింపు
- గొలుగొండ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు
- నిందితుడి అరెస్టు


వలంటీర్ శివరాజ్

**గొలుగొండ, జనవరి 25:** ఓ గ్రామ వలంటీర్ తనపై అత్యాచార యత్నం చేయడంతో పాటు చంపుతానని బెదిరించాడని అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలానికి చెందిన యువతి బుధవారం అర్ధరాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ నారాయణరావు గురువారం తెలిపిన వివరాలివి. చోద్యం గ్రామానికి చెందిన యువతి డిగ్రీ చదువుకుంది. బుధవారం ఎస్.రాయవరం మండలం రేవుపోలవరంలో ఏర్పాటుచేసిన పదో తరగతి బ్యాచ్ సమ్మేళనానికి ఆమె హాజరైంది. సాయంత్రం అక్కడి నుంచి తిరుగు ప్రయాణమైంది. గ్రామానికి చెందిన మరో పూర్వ విద్యార్థి బైక్‌పై ఇంటికి వెళుతుండగా రాత్రి ఏడు గంటల సమయంలో చోద్యం గ్రామ వలంటీర్ మెసర శివరాజ్ గొలుగొండ మండలం కొత్తమల్లంపేట గ్రామ సమీపంలో అడ్డగించి, పక్కనే ఉన్న తుప్పల్లోకి లాక్కెళ్లి తనపై అత్యాచారం చేయబోయాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. అతడి నుంచి తప్పించుకుని తాను ఇంటికి చేరుకున్నానని వెల్లడించింది. ఈ విషయం బయటకు చెపితే చంపేస్తానని బెదిరించాడని, ఆమె తల్లికి వస్తున్న సంక్షేమ పథకాలను కూడా నిలిపివేస్తానని వలంటీర్ బెదిరించాడని బాధితురాలు ఆ ఫిర్యాదులో పేర్కొందన్నారు. చోద్యం గ్రామ సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు అడగర్ల అప్పలనాయుడు సహకారంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితుడు గ్రామ వలంటీరును అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

## బొగ్గు లారీ బోల్తా

**పరవాడ, జనవరి 25:** మండలంలోని రావాడ పంచాయతీ పరిధి సోమునాయుడుపాలెం సమీపంలో గల వంతెన వద్ద బొగ్గు లారీ గురువారం తెల్లవారుజామున బోల్తా పడింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పెదగంట్యాడ మండలం పాలవలస వద్ద గల హిందూజా పవర్‌ప్లాంట్‌కు బొగ్గును అన్‌లోడ్ చేసి తిరిగి వస్తుండగా సోమునాయుడుపాలెం సమీపంలో వంతెన వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి లారీ బోల్తా పడింది. అదృష్టవశాత్తూ డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ సంఘటనపై పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టైరు పేలి.. అదుపు తప్పిన ఎంపీపీ కారు

- ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొనడంతో ఇద్దరికి గాయాలు


టైరు పేలడంతో ప్రమాదానికి గురైన కారు

**కొయ్యూరు, జనవరి 25:** కొయ్యూరు ఎంపీపీ ప్రయాణిస్తున్న కారు ముందు టైరు పేలడంతో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్నది. ఈ సంఘటలో ఎంపీపీ క్షేమంగానే వున్నప్పటికీ ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండల పరిషత్ అధ్యక్షుడు బడుగు రమేశ్‌బాబు గురువారం మధ్యాహ్నం ఇక్కడ కార్యాలయంలో పనులు ముగించుకుని కారులో నర్సీపట్నం బయలుదేరారు. గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెం వద్ద కారు ముందు టైరు పేలింది. దీంతో కారు అదుపు తప్పి ఎదురుగా నర్సీపట్నం నుంచి కృష్ణాదేవిపేట వస్తున్న ఆటోను ఢీకొన్నది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి.

## మట్టి అక్రమ తవ్వకాలపై పోలీసుల దాడులు

- రెండు లారీలు, ఒక ఎక్స్‌కవేటర్ స్వాధీనం

**పరవాడ, జనవరి 25 :** మండలంలోని పెదముషిడివాడ పంచాయతీ పరిధిలో మట్టి అక్రమ తవ్వకాలపై సీఐ బాలసూర్యారావు ఆధ్వర్యంలోట పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. రెండు లారీలతో పాటు ఒక ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మైన్స్ అధికారులకు వాహనాలను అప్పగిస్తామని సీఐ వెల్లడించారు. అయితే వాహనాల యజమాని పేరు మాత్రం సీఐ స్పష్టంగా చెప్పలేకపోయారు. మైన్స్ అధికారులు వాహనాల యజమానుల నుంచి అపరాధ రుసుము వసూలు చేసి అనంతరం విడిచిపెడతారని సీఐ వెల్లడించారు.

## వ్యవస్థలను మేనేజ్ చేయడంలో జగన్ దిట్ట

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్



**అనకాపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):** అన్ని వ్యవస్థలను మొదటి నుంచి మేనేజ్ చేస్తున్న వైఎస్ జగన్ అక్రమ ఆస్తుల కేసుల్లో శిక్ష తప్పదని భావించి న్యాయ వ్యవస్థలను కూడా మేనేజ్ చేయాలని కుట్రలు పన్నుతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ సీఎంకు బినామీలైన టీటీడీ ఈవో ధర్మారావు, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలను వినియోగించుకొని న్యాయమూర్తులను ప్రలోభాలకు గురి చేయాలని ప్రయత్నించారని ఆరోపించారు. దీనిపై సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వం సీబీఐతో విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలుగు యువత రాష్ట్ర నాయకుడు ఆడారి కిషోర్‌కుమార్, రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బుద్ద కాశీ, నోబెల్ టీచర్స్ జిల్లా గౌరవాధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి, సారా రవాణాపై నిఘా పెట్టాలి

- ఎస్ఈబీ అధికారులకు ఎస్పీ మురళీకృష్ణ ఆదేశం

**అనకాపల్లి రూరల్, జనవరి 25:** గంజాయి, సారా రవాణాను నిలువరించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఈబీ అధికారులను ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం జిల్లాకు కొత్తగా బదిలీలపై వచ్చిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నాటుసారా ప్రభావిత ప్రాంతాలను గుర్తించి పూర్తి నిర్మూలనకు కృషి చేయాలన్నారు. సారా తయారీ, రవాణా, విక్రయదారులపై ప్రత్యేక నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పీడీ యాక్టు నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జిల్లాకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే అక్రమ మద్యం రవాణాను అరికట్టేందుకు పోలీస్, ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలని సెబ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్‌తో పాటు సెబ్ అధికారులు పాల్గొన్నారు.

**ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ**

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైన ఆయుధమని ఎస్పీ కేవీ మురళీకృష్ణ పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం సిబ్బందితో ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ పోలీస్ సిబ్బందితో పాటు తమ కుటుంబసభ్యులు, స్నేహితులు ఓటు హక్కు వినియోగించుకునేలా చైతన్యం కల్పించాలన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లోని పోలీస్ అధికారులు ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | రూ.లలో |
| రైతు ధర | 100.00 |
| లైవ్ ధర | 120.00 |
| విత్ స్కిన్ | 210.00 |
| స్కిన్ లెస్ | 220.00 |

| కోడి గుడ్లు (నెక్) | |
|---|---|
| వంద గుడ్లు | రూ.లలో |
| విశాఖపట్నం | 565 |
| విజయనగరం | 569 |
| శ్రీకాకుళం | 569 |

# ఓటు వేయడం అందరి బాధ్యత

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి
- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- వయో వృద్ధ, దివ్యాంగ ఓటర్లకు సన్మానం


వృద్ధ ఓటర్లను సత్కరించిన కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ తదితరులు

**అనకాపల్లి టౌన్, జనవరి 25:** ఓటు హక్కు పొందడం, అలాగే వినియోగించడం అందరి బాధ్యత అని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ స్టేడియం నుంచి రోటరీ క్లబ్ వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఎన్నికలే మూల స్తంభాలని చెప్పారు. ఓటును సద్వినియోగం చేస్తామని ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలన్నారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఓటర్లందరూ స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం వీసీ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ దేశ చరిత్రలో అనకాపల్లికి ప్రత్యేకమైన స్థానం ఉందని, 1989 ఎన్నికల్లో అనకాపల్లి నుంచి పోటీ చేసిన ఎంపీ అభ్యర్థి కేవలం ఏడు ఓట్ల మెజారిటీతో గెలుపొంది చరిత్ర సృష్టించారని చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి అందరితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రోటరీ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ప్రసంగాన్ని ఎల్ఈడీ తెరపై ప్రదర్శించారు. 80 సంవత్సరాలు దాటిన ఆడారి బంగారమ్మ, కొణతాల అప్పల నరసమ్మ అనే వృద్ధ ఓటర్లను, పి.వీరు యాదవ్, ఎం. చంద్రశేఖర్, వై.రవి అనే దివ్యాంగ ఓటర్లను సన్మానించారు. ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణరాజ్, డీఆర్వో బి.దయానిధి, వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ పోలీస్ ఇతర శాఖల సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అమలుకాని ఎమ్మెల్యే ధర్మశ్రీ హామీ

- రోడ్డు, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి నోచుకోని పిత్రిగెడ్డ
- గర్భిణులు, బాలింతలను ఆస్పత్రికి తీసుకెళ్లడానికి డోలీమోతలే శరణ్యం
- వినూత్న రీతిలో నిరసన తెలిపిన గిరిజనులు


చెవుల్లో పూలు పెట్టుకుని డోలీలతో నిరసన తెలుపుతున్న పిత్రిగెడ్డ గిరిజనులు

**రోలుగుంట, జనవరి 25 :** తమ గ్రామానికి రోడ్డు సదుపాయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ మండలంలోని అర్లి పంచాయతీ పిత్రిగెడ్డ గిరిజనులు గురువారం చెవుల్లో పూలు పెట్టుకుని, డోలీ మోతలతో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీటీజీ సంఘం నాయకుడు కిల్లో నరసయ్య, గ్రామ పెద్ద కొర్రా సత్తిబాబు మాట్లాడుతూ, తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించి, పాఠశాల ఏర్పాటు చేయిస్తానని చోడవరం ప్రస్తుత ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, సుమారు ఐదేళ్లు అయినప్పటికీ ఆయన ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదని వాపోయారు. రోడ్డు సదుపాయం లేకపోవడంతో గర్భిణులు, బాలింతలతోపాటు తీవ్ర అనారోగ్యానికి గురైన వారిని ఆస్పత్రికి తీసుకెళ్లడానికి, మళ్లీ తిరిగి గ్రామానికి తీసుకురావడానికి ఐదు కిలోమీటర్ల మేర డోలీల్లో మోసుకెళ్లాల్సి వస్తున్నదని వాపోయారు. రోడ్డు నిర్మాణం గురించి ఎమ్మెల్యే ధర్మశ్రీ పట్టించుకోకపోవడంతో తామే ప్రతి ఇంటికి రూ.3 వేల చొప్పున చందాలు వేసుకుని కొండవాలు ప్రదేశాల్లో నడవడానికి వీలుగా మట్టి రోడ్డు వేయించుకున్నామన్నారు. తమ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల లేదని, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదని, ఆశ కార్యకర్తలు, గ్రామ వలంటీర్లు కూడా లేరని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.గోవిందరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# భారీ వాహనాల రాకపోకలు కట్టడి చేయాలని ఆందోళన

- మునగపాక రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో


మునగపాకలో రాస్తారోకో చేస్తున్న దృశ్యం

**మునగపాక, జనవరి 25:** అనకాపల్లి- అచ్యుతాపురం రహదారిలో భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని మునగపాక రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం మెయిన్‌రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం అధ్యక్షుడు ఆడారి మహేశ్ మాట్లాడుతూ ఎన్నిసార్లు అధికారులకు వినతిపత్రాన్ని ఇచ్చినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. రోడ్డు విస్తరణ జరగక గోతులతో కూడిన ఈ రోడ్డుపై అనేక గ్రామాల ప్రజలు ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. కనీసం మరమ్మతులు సైతం చేయలేదని, ఈ భారీ వాహనాల కారణంగా రోజురోజుకు రోడ్డు మరింత దారుణంగా దెబ్బతింటుందన్నారు. భారీ వాహనాలపై పెద్ద పెద్ద రాళ్లు తీసుకువెళుతున్నారని, ఇటీవల ఒక పెద్ద రాయి అదుపు తప్పి రోడ్డుపై పడిందని, అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. కాగా రాస్తారోకో వల్ల ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఇరువైపుల వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పారు. భారీ వాహనాలతో పాటు ప్రజలు ట్రాఫిక్‌లో ఇరుక్కుని ఇబ్బందులు పడుతున్నారని చెప్పడంతో ఆందోళనకారులు శాంతించారు. తక్షణమే అధికారులు భారీ వాహనాల విషయమై నిర్ణయం తీసుకోకుంటే మళ్లీ ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మునగపాక పీఏసీఎస్ చైర్మన్ కె.రామ్మోహన్, తెలుగుదేశం పార్టీ నాయకులు మొల్లేటి సత్యనారాయణ, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

# వైసీపీ సమావేశానికి తంగేడు రాజులు డుమ్మా

- పార్టీ జిల్లా అధ్యక్షుడి తీరుపై గుర్రుగా ఉన్న నేతలు
- సీఎం జగన్ సభకు జనం తరలింపుపై సమావేశం నిర్వహించాలని పార్టీ మండల అధ్యక్షుడికి వర్తమానం
- తమకు మాటమాత్రంగానైనా చెప్పలేదని తంగేడు రాజులు అసంతృప్తి
- సమావేశానికి గైర్హాజరు.. ఎంపీపీ, జడ్పీటీసీ మెంబర్ కూడా...


తంగేడు రాజులు లేకుండా సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**కోటవురట్ల, జనవరి 25:** అధికార పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడి తీరుపై 'తంగేడు రాజులు' గుర్రు వున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భీమిలి నియోజవర్గంలో ఈ నెల 27న నిర్వహించే వైసీపీ ఉత్తరాంధ్ర సదస్సుకు సంబంధించి వైసీసీ కోటవురట్ల మండల అధ్యక్షుడు ఏర్పాటు చేసిన సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైఎస్ ఎంపీపీ సాగి సీతారామరాజు (సీతబాబు) గైర్హాజరయ్యారు. వీరితోపాటు ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యురాలు కూడా డుమ్మా కొట్టారు. మరోవైపు రాజకీయ పార్టీ సమావేశాన్ని మండల పరిషత్ కార్యాలయం మేడపైన హాలులో నిర్వహించడం చర్చనీయాశమైంది.

భీమిలి నియోజకవర్గం పరిధిలోని సంగివలస వద్ద ఈ నెల 27వ తేదీన సీఎం జగన్మోహన్‌రెడ్డి నిర్వహించే ఎన్నికల శంఖారావం సభకు కోటవుటర్ల మండలం నుంచి కార్యకర్తల తరలింపుపై సమావేశం ఏర్పాటు చేయాలని వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావుకు వర్తమానం పంపారు. కానీ ఈ విషయాన్ని తంగేడు రాజులైన డీవీ సూర్యనారాయణరాజు, సాగి సీతబాబుకు జిల్లా అధ్యక్షుడు మాటమాత్రంగా అయినా చెప్పలేదు. వాస్తవంగా మండలంలో పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా ఏ కార్యక్రమం జరిగినా తంగేడు రాజులకు సమాచారం ఇవ్వడం ఆనవాయితీ. కానీ సీఎం సభకు జనం తరలింపు కోసం ఏర్పాటు చేసే సమావేశం గురించి వీరికి ఎటువంటి సమాచారం ఇవ్వలేదు.

కాగా వైసీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు గురువారం మండల పరిషత్ కార్యాలయం పై అంతస్తులో వున్న హాల్‌లో వైసీపీ విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి తంగేడు రాజులతోపాటు ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు, జడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి కూడా హాజరుకాలేదు. ఇదిలావుండగా ఈ సమావేశానికి హాజరైన వెసీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పైల రమేశ్ వర్గీయులకు, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు వర్గీయులకు మధ్య గొడవ జరిగినట్టు తెలిసింది. మండల, జిల్లా పరిషత్ నిధులు మంజూరు విషయంలో తమపట్ల వివక్ష చూపుతున్నారని రమేశ్ వర్గీయులు ఆరోపించగా, ఇరువర్గాల వారు వాగ్వాదానికి దిగినట్టు సమాచారం.

## పసి బిడ్డను ఇస్తానని మోసం

- రూ.80 వేలు తీసుకొని పరారైన మహిళ
- విశాఖ కేజీహెచ్‌లో ఘటన
- వన్‌టౌన్ పోలీసులకు బాధితుల ఫిర్యాదు
- ఏలూరుకు చెందిన నిందితురాలి అరెస్టు

**విశాఖపట్నం, జనవరి 25:** పిల్లలు లేని మహిళకు అప్పుడే పుట్టిన బిడ్డను ఇస్తానని ఆశపెట్టిన ఓ మహిళ రూ.80 వేలు తీసుకుని మోసం చేసి, పరారైంది. ఈ సంఘటన విశాఖ కేజీహెచ్‌లో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...కాకినాడ జిల్లా చేబ్రోలుకు చెందిన వేణుకోటి కృష్ణవేణి (35)కి పదేళ్ల కిందట వివాహం జరిగింది. ఆమెకు పిల్లలు లేరు. దీంతో తీవ్రంగా మథనపడేది. ఈ క్రమంలో తన సమీప బంధువు వి.లక్ష్మితో బాధను పంచుకుంది. దీంతో ఆమె గాజువాకలో తనకు తెలిసిన వైద్యునికి చూపిస్తే ఫలితం ఉంటుందని చెప్పింది. ఇద్దరూ ఈనెల 20న చేబ్రోలు నుంచి బస్సులో గాజువాక బయలుదేరారు. బస్సు అన్నవరం వచ్చేసరికి వారికి ఓ మహిళ పరిచయమైంది. వారి సమస్యను తెలుసుకుని, తనకు తెలిసిన వారు కేజీహెచ్‌లో ఉన్నారని, పెంచుకుంటానంటే అప్పుడే పుట్టిన బిడ్డను న్యాయబద్ధంగా అందిస్తానని నమ్మబలికింది. అందుకు కొంత డబ్బు ఖర్చవుతుందని చెప్పింది. దీనికి అంగీకరించిన వారిద్దరూ ఈనెల 21వ తేదీన విశాఖలోని కేజీహెచ్ వద్దకు వచ్చారు. అక్కడ ఆ మహిళకు రూ.80 వేలను అందించారు. వారిని అక్కడే ఉండమని, బిడ్డను తీసుకువస్తానని చెప్పిన ఆ మహిళ కేజీహెచ్‌లో పిల్లల వార్డు వద్దకు వెళ్లింది. ఎప్పటికీ తిరిగి రాకపోవడంతో ఆమె కోసం కేజీహెచ్ మొత్తం గాలించారు. అయినా ఫలితం కనిపించకపోవడంతో మోసపోయామని గ్రహించి, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి, మోసం చేసిన మహిళ ఏలూరుకు చెందిన దొంగ వాణి (31)గా గుర్తించారు. ఆమె విశాఖలోని ఎన్జీవో కాలనీలోనే నివాసముంటున్నట్టు గుర్తించి, అరెస్టు చేశారు.

## ఉద్యమ నేత బాలకృష్ణకు నివాళి



బాలకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

**అనకాపల్లి టౌన్, జనవరి 25 :** జిల్లాలో ఏ ఉద్యమాల్లోనైనా నేనున్నానంటూ ముందు నిలిచిన వ్యక్తి బాలకృష్ణ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. గురువారం రాత్రి స్థానిక గవరపాలెం వీవీ రమణ రైతు భారతి హాల్‌లో కామ్రేడ్ ఎ.బాలకృష్ణ సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అనేక ఉద్యమాలకు బాలకృష్ణ రూపకర్తగా నిలిచారని కొనియాడారు. జిల్లాలో సాగిన అనేక ఉద్యమాలకు ఊపిరి పోశారన్నారు. వామపక్ష ఉద్యమానికి దిక్సూచిగా నిలిచారన్నారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ దశాబ్దకాలంగా బాలకృష్ణ అనేక ఉద్యమాల్లో పాల్గొని అందరికీ ఆదర్శప్రాయుడయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బి. వెంకటరమణ, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కన్వీనర్ పీఎస్ అజయ్‌కుమార్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నరసింగరావు, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు రాంబాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి కె. లోకనాథం, ఐద్వా రాష్ట్ర అధ్యక్షుడు బి. ప్రభావతి, సీపీఐ నాయకులు వైఎన్ భద్రం, పాత్రికేయుడు రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. బాలకృష్ణ జ్ఞాపకాలు పేరుతో బాలకృష్ణ స్మృతులను సంకలనంగా తీసుకువచ్చిన పుస్తకాన్ని వక్తలు ఆవిష్కరించారు.

## 27 నుంచి జేఈఈ మెయిన్స్

- వచ్చే నెల ఒకటో తేదీ వరకు పరీక్షలు
- విశాఖలో పరీక్షలకు 20 వేల మంది విద్యార్థులు

**విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):** ఐఐటీ, ఎన్ఐటీ, తత్సమాన విద్యా సంస్థల్లో ప్రవేశాలు కల్పించేందుకు జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షలు ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల ఒకటో తేదీ వరకు జరగనున్నాయి. ప్రధానంగా బీఇ/బీటెక్ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు జేఈఈ పరీక్షకు హాజరవుతారు. ప్రతిరోజు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, తిరిగి మూడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ జరగనున్న ఈ పరీక్షలకు ఉత్తరాంధ్ర నుంచి సుమారు 20 వేల మంది హాజరవుతున్నారు. ఆర్కిటెక్చర్ కోర్సుల్లో చేరనున్న విద్యార్థులకు జేఈఈ పేపర్-2 పరీక్ష బుధవారం జరిగింది. నగరంలో చినముషిడివాడ, పీలానగర్, గాజువాక, ఎన్ఏడీ జంక్షన్‌లోని డిజిటల్ సెంటర్లను జేఈఈ మెయిన్స్ పరీక్షలకు కేంద్రాలుగా ఎంపిక చేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు గంటన్నర ముందుగా కేంద్రాలకు చేరుకోవాలి. జేఈఈ మెయిన్స్‌లో వచ్చిన మార్కులను కటాఫ్‌గా తీసుకుని అడ్వాన్స్‌డ్ ప్రవేశపరీక్షకు అర్హత కల్పిస్తారు. ఎన్ఐటీతోపాటు ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు జేఈఈ మెయిన్స్‌లో వచ్చిన మార్కులను ప్రాతిపదికగా తీసుకుంటారు. జేఈఈ మెయిన్స్ పరీక్షలు రాయనున్న విద్యార్థులు ఇప్పటికే అడ్మిట్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకున్నారు.

## ఏడుగురు సీఐలు బదిలీ

**విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):** విశాఖ రేంజ్‌లో ఏడుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీ హరికృష్ణ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తూ రేంజ్ వేకెన్సీ రిజర్వులో ఉన్న సీఐలు వాసంశెట్టి శ్రీనివాసరావు, టి.కల్యాణి, రొంగలి అప్పలనాయుడు, శ్రీకాకుళం జిల్లా స్పెషల్ బ్రాంచి (ఎక్స్) సీఐగా ఉన్న జి.దాలిబాబును విశాఖ నగరానికి కేటాయించారు. విశాఖ రేంజ్‌లో ఉన్న జి.దివాకర్ యాదవ్‌ను శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస సీఐగా పోస్టింగ్ ఇచ్చి అక్కడ పనిచేస్తున్న పి.పైడయ్యను టెక్కలి సీఐగా, అనకాపల్లి పోలీస్ కంట్రోల్‌రూమ్‌లో పనిచేస్తున్న సీఐ పి.పైడపునాయుడును అనకాపల్లి ట్రాఫిక్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

## 29 నుంచి ఏపీఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ

**విశాఖపట్నం, జనవరి 25:** ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ప్రజాభిప్రాయ సేకరణను ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు నిర్వహించనుంది. విద్యుత్ సంస్థలు ఏపీఈఆర్‌సీకి సమర్పించిన 2024-25 ఆర్థిక సంవత్సరానికి అమలుచేయనున్న వార్షికాదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్), బహుళ వార్షిక కాల వ్యవధి 2024 నుంచి 2029 నియంత్రణ కాలానికి సంబంధించి నెట్‌వర్క్ ఆదాయ అవసరాల నివేదికలపై ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉదయం 10-30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తిరిగి, 2 నుంచి సాయంత్రం 4-30 గంటల వరకు వర్చువల్‌గా అభిప్రాయాలు తెలపవచ్చని సంస్థ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ ఎల్.మహేంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏపీఈపీఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, సభ్యులు ఠాకూర్ రాంసింగ్, పీవీఆర్ రెడ్డి హాజరవుతారన్నారు. ఏపీఈఆర్సీ అధికారులతో పాటు ఇంధనశాఖ, ట్రాన్స్‌కో, జెన్‌కో, ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ అధికారులు పాల్గొంటారన్నారు. నాలుగు రోజుల పాటు జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో ఏపీఈఆర్సీ ప్రతి రోజు ట్రాన్స్‌కో, జెన్‌కో, మూడు విద్యుత్ పంపిణీ సంస్థల టారిఫ్ ఫైలింగ్‌కు సంబంధించిన అభిప్రాయాలను విశాఖ నుంచే స్వీకరిస్తారన్నారు. అభిప్రాయాలు చెప్పదలచుకున్నవారు గ్రీన్‌పార్క్ హోటల్ ఎదురుగా ఉన్న విద్యుత్ శాఖ భవన్‌లోని విశాఖపట్నం ఆపరేషన్ సర్కిల్ కార్యాలయం ఎస్ఈ ఆఫీస్, జోన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆఫీస్, జోన్-2 కంచరపాలెం రామ్మూర్తి పంతులుపేటలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆఫీస్, మధురవాడ, అనకాపల్లి, కశింకోట, నర్సీపట్నం ప్రాంతాల్లోని ఈఈ కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు.

## సింహాద్రి ఎన్‌టీపీసీ నాలుగో యూనిట్‌లో ఉత్పత్తికి అంతరాయం

**పరవాడ, జనవరి 25:** అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో గల సింహాద్రి నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ)లోని నాలుగో యూనిట్‌లో గురువారం మధ్యాహ్నం విద్యుదుత్పత్తికి అంతరాయం ఏర్పడింది. యూనిట్‌కు సంబంధించిన బాయిలర్ ట్యూబ్‌లకు రంధ్రాలు ఏర్పడడంతో ఉత్పత్తి అర్ధాంతరంగా నిలిచిపోయింది. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు ప్రారంభించారు. మిగతా ఒకటి, రెండు, మూడు యూనిట్‌లలో ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరుగుతుందని అధికారులు తెలిపారు. ఎన్‌టీపీసీలోని నాలుగు యూనిట్లు ఒక్కొక్కటి 500 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉన్నాయి.

## నేటి నుంచి ఆఫ్‌లైన్‌లో టెస్టు మ్యాచ్ టికెట్లు విక్రయం


**విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 25:** భారత్, ఇంగ్లండ్ మధ్య రెండో తేదీ నుంచి నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్న టెస్టు మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లు శుక్రవారం నుంచి ఆఫ్‌లైన్‌లో విక్రయిస్తామని ఏసీఏ కార్యదర్శి గోపినాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం వద్ద శుక్రవారం నుంచి ఫిబ్రవరి ఒకటి వరకు, పీఎం పాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వద్ద శుక్రవారం నుంచి ఆరో తేదీ వరకు ఉదయం పది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు టికెట్ల విక్రయాలు జరుగుతాయన్నారు. రోజుకు రెండు వేల మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించనున్నామని, ఆసక్తి గల వారు పాఠశాల గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

**టికెట్ల ధరలివి**

**రోజువారీ టికెట్ల ధరలు:** రూ.100, రూ.200, రూ.300, రూ.500.

**ఐదు రోజులకు సీజన్ టికెట్లు:** రూ.400, రూ.800, రూ.1,000, రూ.1500

## గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు



**అనకాపల్లి టౌన్, జనవరి 25 :** స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించే గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం జరిగే జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యే ఉన్నతాధికారులు, వీఐపీలు కూర్చోవడానికి అవసరమైన ఏర్పాట్లను రెవెన్యూ అధికారులు పూర్తి చేశారు. వివిధ స్టాల్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. శకటాలను సిద్ధం చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు.

## హస్తినలో అల్లూరి జిల్లా వాసులు

» భారత గణతంత్ర వేడుకలకు హాజరు » ప్రధానితో కలిసి ఫొటో



ప్రధాన మంత్రి మోదీ, కేంద్ర మంత్రులతో కలిసి ఉన్న అల్లూరి జిల్లావాసులు

**పాడేరు రూరల్, జనవరి 25 :** భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ తన నివాసంలో గురువారం ఎన్‌సీసీ, గిరిజన నాయకులు, గిరిజన విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. జాతిని జాగృతం చేసే విధానం, అభివృద్ధి, భవిష్యత్తులో ఏవిధంగా ముందుకు వెళ్లాలి అనే అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పాడేరు ఐటీడీఏ పరిధిలోని విద్యార్థులతో పాటు వివిధ రాష్ట్రాల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం అందరితో కలిసి ప్రధాని ఫొటోకు దిగారు. ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి, క్రీడలు, సమాచార శాఖ మంత్రి, ఇతర అధికారులతో పాటు అల్లూరి జిల్లా పాడేరు మండలం దిగువమోదాపుట్టు వ్యాయామ ఉపాధ్యాయులు సోమెలి సింహాచలం, పెదగరువు వ్యాయామ ఉపాధ్యాయిని సుధారాణి, బంధపల్లి వ్యాయామ ఉపాధ్యాయులు కె.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన సీఐ

**ముంచంగిపుట్టు, జనవరి 25 :** సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్నివర్గాల వారు తమవంతు సహకారం అందించాలని జి.మాడుగుల సీఐ కె.రమేష్ కోరారు. మండలంలో ఏర్పాటు చేసిన పలు పోలింగ్ స్టేషన్లను గురువారం సందర్శించారు. అనంతరం అక్కడి అధికారులతో సమావేశమై పోలింగ్ కేంద్రాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఎన్నికలు సజావుగా సాగే బాధ్యత అందరిపై ఉందని వివరించారు.

## జన్‌మన్.. ఆదిమ గిరిజనుల దశ తిరిగేన్

... 5వ పేజీ తరువాయి

ఉప కేంద్రంతోపాటు సామాజిక భవనం ఉండేలా రూ.60 లక్షల వ్యయంతో దానిని నిర్మిస్తారు. ఇప్పటికే ఏజెన్సీలో 83 మల్టీపర్పస్ హాళ్ల నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా, దశలవారీగా గుర్తించిన గ్రామాల్లో వాటిని నిర్మిస్తారు. వారి స్వయం ఉపాధికి రాయితీ రుణాలు, ఆయా గ్రామాల్లో మౌలిక సదుపాయాలైన నీరు, విద్యుత్ సదుపాయాలతో పాటు వీధుల్లో సిమెంట్ కాంక్రీట్ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మిస్తారు. దీంతో ఆదిమ జాతి గిరిజనులు వ్యక్తిగతంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతారని అధికారులు అంటున్నారు. అలాగే జన్‌మన్ పథకంపై ఏజెన్సీలోని ఆదిమ జాతి గిరిజనులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## మన్యంలో 264 సెల్ టవర్లు ప్రారంభం



క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్‌గా సెల్ టవర్లను ప్రారంభిస్తున్న సీఎం

... 5వ పేజీ తరువాయి

నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు,అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

### మెరుగుపడనున్న సమాచార వ్యవస్థ

**డుంబ్రిగుడ:** గిరిజన గ్రామాల అభివృద్ధికి, సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించడానికి మొబైల్ నెట్‌వర్క్ సేవలు ఎంతో ఉపయోగపడతాయని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. మండలంలోని లైగండ పంచాయతీ కేంద్రంలో గురువారం నిర్వహించిన సెల్ టవర్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సెల్ టవర్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయించిన అధికారులను ఆయన అభినందించారు. జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఐటీడీఏ పీవో అభిషేక్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, గిరిజన సంక్షేమశాఖ ఈఈ వేణుగోపాల్, ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటీసీ జానకమ్మ, తహసీల్దార్ నాగమ్మ, ఎంపీడీవో ఉషారాణి, సర్పంచ్ శాంతి, ఎంపీటీసీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై పింఛనర్ల ఆందోళన



పాడేరులో తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న పింఛనర్లు

... 5వ పేజీ తరువాయి

రాయితీలు, సదుపాయాలు సంపూర్ణంగా కల్పించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ పరిష్కరించాలని వారంతా డిమాండ్ చేశారు. అనంత రం తహసీల్దార్ వి.త్రినాథరావునాయుడుకు వినతి పత్రం సమర్పించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతలు టి.అప్పారావు, టి.శ్రీహరి, జి.మోహనరావు, బి.త్రినాథరావు, కె.సూర్యనారాయణ, కె.మచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

### పీఆర్‌సీ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి

**చింతపల్లి :** పీఆర్‌సీ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘం మండల అధ్యక్షుడు తగ్గి సన్యాసిపడాల్ కోరారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట పింఛనర్లు ఆందోళ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 జనవరి నుంచి పదకొండో పీఆర్‌సీలో తగ్గించిన అడిషనల్ క్వాంటమ్‌ను యథావిధిగా, పీఆర్‌సీ ఎరియర్స్‌ను చెల్లించాలని కోరారు. అలాగే, మెడికల్ రీయింబర్స్‌మెంట్ వర్తింపజేయడంతో పాటు హెల్త్‌కార్డుల ద్వారా ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం అందించాలన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సంఘం నాయకులు బల్లుల పెద్దబ్బాయి, అప్పలస్వామి, రామన్నపడాల్ తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లిలో సమస్యలపై నినాదాలు చేస్తున్న పింఛనర్లు

# పోలీసుల తీరుపై గిరిజనుల ఆగ్రహం

» పలు గ్రామాల నుంచి భారీగా తరలివచ్చి ముంచంగిపుట్టులో ఆందోళన » ఎస్ఐ తప్పుడు కేసులతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపణ

» తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ » లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు చేపడతామని సీఐ రమేష్ హామీ



ఆందోళనకారులతో మాట్లాడుతున్న సీఐ రమేష్



ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ముంచంగిపుటులో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

**ముంచంగిపుట్టు, జనవరి 24 :** ఆదివాసీలను వేధింపులకు గురిచేస్తున్న ముంచంగిపుట్టు పోలీస్ స్టేషన్ ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పలు గ్రామాల గిరిజనులు గురువారం పెద్ద ఎత్తున ఇక్కడ ఆందోళన చేపట్టారు. ఎస్ఐకి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీ నిరసన ర్యాలీ నిర్వహించి రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ కె.త్రినాథ్ మాట్లాడుతూ సుమారు గత ఆరు నెలలుగా ఎటువంటి తప్పులు చేయనప్పటికీ అకారణంగా స్థానిక ఎస్ఐ మారుమూల లక్ష్మీపురం, రంగబయలు, బుంగాపుట్టు, బాబుసాల పంచాయతీల్లో గల పలు గ్రామాల గిరిజనులను వేధింపులకు గురిచేయడంతో పాటు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఎస్ఐతో పాటు పలువురు పోలీసులు, హోంగార్డులు గంజాయి తనిఖీల పేరుతో గ్రామాల్లోకి, ఇళ్లలోకి చొరబడుతున్నారన్నారు. మావోయిస్టులకు సహకరిస్తున్నారని, గంజాయి సాగు, విక్రయాలు, రవాణా వంటివి చేస్తున్నారని తప్పుడు కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. స్టేషన్‌కు తీసుకువచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అలాగే తమ గ్రామాలకు పక్కా రహదారి సౌకర్యం ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపడం లేదని, ఫలితంగా ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో వాహనదారులు నిబంధనలు పాటించడం లేదంటూ డ్రైవర్లపైన, ప్రయాణికులపై పోలీసులు దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. ఆర్టీసీ బస్సులు తిరగకపోతే తామంతా ఎలా రాకపోకలు సాగించాలని ప్రశ్నించారు. అకారణంగా గిరిజనులు వేధింపులకు గురిచేస్తున్న ఎస్ఐతో పాటు పోలీసులు, హోంగార్డులపై ఎస్టీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని, శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌తో పాటు పలు గ్రామాల గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ కె.రమేష్ ఆందోళన కారులతో మాట్లాడారు. పోలీసుల పరంగా ఎటువంటి సమస్యలు ఉన్నా లిఖితపూర్వకంగా ఫిర్యాదులు అందిస్తే పరిశీలించి తగు చర్యలు చేపడతామని వారికి హామీ ఇచ్చారు. దీంతో వారంతా శాంతించారు. అనంతరం ఎస్ఐతో పాటు పలువురు పోలీసులు, హోంగార్డులపై చర్యలు తీసుకోవాలని సీఐకి వారు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం సీఐ రమేష్ విలేకర్లతో మాట్లాడుతూ ఎస్ఐతో పాటు పలువురు పోలీసులు, హోంగార్డులపై గిరిజనులు నుంచి అందిన ఫిర్యాదు మేరకు సమగ్ర దర్యాప్తు జరిపిన అనంతరం తదుపరి చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో రంగబయలు సర్పంచ్ ధనియా, ఎంపీటీసీ సభ్యుడు వి.సాధూరాం, పలు గ్రామాల గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వాడవాడలా ఘనంగా ఓటర్ల దినోత్సవం



డుంబ్రిగుడలో...



అరకులోయలో సీనియర్ సిటిజన్లను సత్కరించిన తహసీల్దార్ తదితరులు

**అరకులోయ, జనవరి 25 :** ఓటు వజ్రాయుధం వంటిదని, ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ కోరారు. అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల్లో చక్కని పరిపాలనాదక్షత గల నాయకులను ఎన్నుకునేందుకు ఓటు దోహదపడుతుందన్నారు. ఎంపీడీవో వెంకటేశ్ మాట్లాడుతూ ఓటు హక్కు కలిగి ఉన్నవారు మంచి నాయకులను ఎన్నుకుంటే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందన్నారు. అనంతరం ముగ్గురు సీనియర్ సిటిజన్లను ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ చలపతి, ఎలక్షన్ డీటీ మత్స్యరాజు, ఎన్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మి, నాగబాబు, రాజనీతిశాస్త్రం అధ్యాపకులు డాక్టర్ స్వర్ణలత, మహిళా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చలపతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**కొయ్యూరు :** ప్రతి ఒక్కరూ ఓటు విలువను తెలుసుకుని, ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ తిరుమలరావు సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఇక్కడి కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించడంతో పాటు పలువురు సీనియర్ ఓటర్లను సత్కరించారు. కేజీబీవీ ఎస్‌వో పరిమళ, ఉపాధ్యాయ, విద్యార్థినులు పాల్గొన్నారు.

**డుంబ్రిగుడ:** మండల కేంద్రం డుంబ్రిగుడలో ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ జరిపారు. డిప్యూటీ తహసీల్దార్ ముజీబ్ ఓటు హక్కు వినియోగాన్ని వివరించారు. అనంతరం సీనియర్ సిటిజన్‌ను సత్కరించారు. ఆర్ఐ హరికృష్ణ, సీనియర్ అసిస్టెంట్ కామరాజు, రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

**సీలేరు :** ఓటరు దినోత్సవం సందర్భంగా సీలేరులో జూనియర్ కాలేజీ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే సచివాలయం సిబ్బంది ఆధ్వర్యంలో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ జరిపారు. జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.సాయిరామ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాస్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమారాణి, ఎంపీటీసీ పి.సాంబమూర్తి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**హుకుంపేట :** ఓటర్లు దినోత్సవాన్ని హుకుంపేటలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. డీటీ కృష్ణారావు, సినియర్ అసిస్టెంట్ మోహన్‌రావు, వీఆర్‌వో కొండబాబు, ఎంపీటీసీ కొమ్మ రమా, నాయకుడు సత్యం, ఉప సర్పంచ్ గణవింద్ తదితరులు పాల్గొన్నారు

## పాడేరులో టీడీపీ విజయమే లక్ష్యం

» నియోజకవర్గ స్థాయి సమావేశంలో నాయకులు వెల్లడి



నియోజకవర్గ స్థాయి సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

**పాడేరు రూరల్, జనవరి 25 :** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పనిచేస్తామని మాజీ మంత్రి ఎం.మణికుమారి, సీనియర్ నాయకులు బొర్రా నాగరాజు, కొట్టగుల్లి సుబ్బారావు, ఎంవీవీ ప్రసాద్ స్పష్టం చేశారు. పాడేరులో గురువారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం అనంతరం వారు మాట్లాడారు. పార్టీ విజయానికి ఇప్పటి నుంచే కార్యకర్తలంతా సైనికుల్లా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు దుచ్చేరి చిట్టిబాబు, బొర్రా విజయరాణి, జి.శ్రీరామ్మూర్తి, బి.బాలరాజు, ఎం.మత్స్యరాజు, ఉల్లి రామారావు, బేరా సత్యనారాయణ, వి.పిన్నయ్యదొర, కిముడు నారాయణ, ఎస్.నాగబ్బాయి, కిముడు లక్ష్మయ్య, లోతా భీమరాజు, గోపి, వినోద్, కొండబాబు, ప్రశాంత్, కించే రమణ తదితరులు పాల్గొన్నారు.

### పిల్లలను పాఠశాలలకు పంపించాలి : పీవో అభిషేక్



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న పీవో అభిషేక్

**డుంబ్రిగుడ, జనవరి 25 :** బడిఈడు పిల్లలను పాఠశాలలకు పంపించాలని ఐటీడీఏ పీవో అభిషేక్ అన్నారు. మండలంలోని కంద్రుం పంచాయతీ సర్రాయి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మించిన భవనాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. పిల్లలను చక్కగా చదివిస్తే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. పాఠశాలలకు ప్రతిరోజూ పిల్లలను పంపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. వైస్ ఎంపీపీ ఆనందరావు, సర్పంచ్ హరి, గిరిజన సంక్షేమశాఖ ఈఈ వేణుగోపాల్, ఏఈ అభిషేక్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంత సమస్యలపై సీపీఐ ధర్నా



కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

**పాడేరు రూరల్, జనవరి 25 :** గిరిజన ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పి.సత్యనారాయణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న హౌసింగ్, కాఫీ బకాయి బిల్లులు తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని, గతుకుల మయంగా మారిన ప్రధాన రహదారులు మరమ్మతులు చేయాలని, కొత్తరహదారులు మంజూరు చేయాలని, గిరిజన గ్రామాల్లో తాగునీటి సౌకర్యాలు కల్పించాలని నినాదాలు చేశారు. అనంతరం గిరిజనులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు విష్ణుమూర్తి, పోతురాజు, కృష్ణ, రాధాకృష్ణ, సత్తిబాబు, రాజుబాబు, అమర్, చంటిబాబు, సింహాచలం, కామేశ్వరరావు పాల్గొన్నారు

### 29న యువత ముందున్న సవాళ్లపై సదస్సు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ ప్రతినిధులు

**పాడేరు రూరల్, జనవరి 25 :** యువత ముందున్న సవాళ్లపై ఈనెల 29న విజయవాడలో రాష్ట్ర సదస్సు జరగనుందని ఏఐవైఎఫ్ ప్రతినిధి ముచ్చల లక్ష్మణ్ తెలిపారు. గురువారం ఇక్కడ ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక, పరిశ్రమలు రాక నిరుద్యోగం, పేదరికం పెరిగిపోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. పాలక ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల వల్ల చదువుకు తగిన ఉద్యోగాలు లభించక విద్యావంతులైన యువత కూలిపనులకు వలసలుపోయే దుస్థితి రాష్ట్రంలో నెలకొందని వాపోయారు. ఈ కార్యక్రమంలో అఖిల్, రాజ్‌గోపాల్, శ్రీను, చిన్నయ్య, సన్యాసిరావు, సత్తిబాబు పాల్గొన్నారు.

## 'టూరిజం హోటళ్లు, రిసార్ట్స్‌ల ప్రైవేటీకరణ చట్ట విరుద్ధం'

సీఐటీయూ, గిరిజన సంఘం స్పష్టీకరణ





సమావేశంలో పాల్గొన్న సీఐటీయూ ప్రతినిధులు

**అరకులోయ, జనవరి 25 :** అల్లూరి జిల్లా పరిధిలో ఉన్న టూరిజం హోటళ్లు, రిసార్ట్స్‌ల ప్రైవేటీకరణ చట్ట విరుద్ధమని, ఇది ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ గిరిజన చట్టాలను ఉల్లంఘించే చర్యలకు పాల్పడడమేనని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం అల్లూరి జిల్లా ఉపాధ్యక్షుడు పొద్దు బాలదేవ్ గురువారం వేర్వేరు సమావేశాల్లో అన్నారు. గిరిజన ప్రాంతంలో ఐదో షెడ్యూల్ 1/70 చట్టం అమలులో ఉండగా, ఈ-టెండర్ పేరుతో ప్రైవేటు వ్యక్తులకు టూరిజం హోటళ్లు, రిసార్టులను ఎలా కట్టబెడతారని వారు ప్రశ్నించారు. వెంటనే ఈ-టెండర్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అరకులోయ, అనంతగిరి, చింతపల్లి మండలాల పరిధిలో కోట్లాది రూపాయల ప్రభుత్వ నిధులతో ఏర్పాటుచేసిన టూరిజం హోటళ్లు, రిసార్టుల వల్ల ఏటా రూ.20 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుందని వివరించారు. ఇటువంటి లాభదాయకమైన యూనిట్లను వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు తమ అనుచరులకు కట్టబెట్టేందుకు పూనుకోవడం దారుణమన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు డి.పోతురాజు, మగ్గన్న పాల్గొన్నారు.

## గుండె సంబంధిత వ్యాధితో ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

» గత కొంతకాలంగా అనారోగ్యంతో తరగతులకు దూరం

» బట్టపణుకులో ఇంటి వద్ద ఉండగా ఊపిరాడక నర్సీపట్నం ఆస్పత్రిలో చేరిక

» చికిత్స పొందుతూ మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు



వరలక్ష్మి (ఫైల్)

**కొయ్యూరు, జనవరి 25 :**గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ మండలంలో వైఎస్ పాకలు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని సెగ్గే వరలక్ష్మి(13) బుధవారం అర్ధరాత్రి దాటాక నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో మృతిచెందింది. ఇందుకు సంబంధించి మృతురాలి కుటుంబీకులు తెలిపిన వివరాలివి. గత కొన్ని నెలలుగా వరలక్ష్మి గుండె సంబంధిత వ్యాధితో పాఠశాలకు వెళ్లకుండా బట్టపణుకుల గ్రామంలోని తల్లిదండ్రులు రాంబాబు, దారమ్మల వద్దనే ఉంటుంది. బుధవారం సాయంత్రం శ్వాస ఆడక పరిస్థితి విషమంగా మారింది. వెంటనే తల్లిదండ్రులు ఆమెను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్య సేవలు అందించిన అనంతరం వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అయితే అప్పటికే అర్ధరాత్రి దాట దంతో ఉదయం తీసుకు వెళ్లేందుకు కుటుంబీకులు నిర్ణయిం చుకుని అక్కడే ఉంచారు. రాత్రి రెండు గంటల సమయంలో పరిస్థితి విషమించి తమ ఒక్కగానొక్క కుమార్తె మృతిచెందినట్టు తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

### కొయ్యూరు సీఐగా వెంకటరమణ బాధ్యతలు



**కొయ్యూరు, జనవరి 25 :** కొయ్యూరు సీఐగా పి.వెంకటరమణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈయన జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో గంజాయి సాగు, రవాణాను కట్టడి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించనున్నట్టు చెప్పారు. కొయ్యూరు ఎస్ఐ కె.రామకృష్ణ, మంప ఎస్ఐ లోకేష్‌కుమార్, ఏఎస్ఐ దేముడు, సిబ్బంది ఆయన పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు.

### పేకాట ఆడుతున్న పది మందిపై కేసు

**గూడెంకొత్తవీధి, జనవరి 25 :** మండలంలోని రింతాడ గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడిచేసి పది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన ఎస్ఐ అప్పలసూరి తెలిపిన వివరాలివి. రింతాడలో రెండు రోజులుగా గ్రామ దేవత జాతర జరుగుతున్న నేపథ్యంలో గ్రామ శివారులో పేకాట నిర్వహిస్తున్నట్టు పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. దీంతో బుధవారం అర్ధరాత్రి సిబ్బందితో దాడిచేసి ఎదిమందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అంతేకాకుండా వారి నుంచి రూ.88 వేల నగదు స్వాధీనం చేసుకుకి కేసులు నమోదు చేసినట్టు చెప్పారు.

### యూటీఎఫ్ సభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

**ముంచంగిపుట్టు, జనవరి 25 :** పాత పెన్షన్‌ను సాధించేందుకు ఈ నెల 28న రాజమండ్రిలో నిర్వహించనున్న సభను ఉపాధ్యాయులంతా విజయవంతం చేయాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎస్.రాజు కోరారు. ఈ మేరకు ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ధర్మారావు, కార్యవర్గ సభ్యులు శ్రీనివాసమూర్తి, త్రినాథం, రాజేంద్ర ప్రసాద్, చిన్నబ్బాయి, కృష్ణ, సుబ్బారావు పాల్గొన్నారు.

### కరాటే శిక్షణ శిబిరానికి టీడీపీ ఆర్థిక సాయం





నిర్వాహకునికి నగదు అందిస్తున్న సుబ్బారావు

**చింతపల్లి, జనవరి 25 :** మండలంలోని ఆదివాసీ యువతకు ఉచితంగా కరాటేలో శిక్షణ అందిస్తున్న శిబిరం నిర్వాహకునికి ఉమ్మడి జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి కొట్టగుల్లి సుబ్బారావు గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. సబ్ డివిజన్ కేంద్రంలో జిల్లా ముఖ్య శిక్షకుడు బాకూరు పాండురాజు కొంత కాలంగా ఆదివాసీ యువతకు కరాటేలో శిక్షణ ఇస్తున్నాడు. ఇతని వద్ద శిక్షణ పొందిన వారు పలు పోటీల్లో రాణిస్తున్నారు. ఈ విద్యను మరింత ప్రోత్సహించేందుకు సుబ్బారావు పది వేల రూపాయలను సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినూత్న నాయుడు, పాడేరు మాజీ సర్పంచ్ పిన్నయ్యదొర, టీడీపీ నాయకులు వినోద్, శిక్షకుడు దేశగిరి సత్తిబాబు, గణేశ్, శ్రీనుబాబు పాల్గొన్నారు.

### 'అవినీతి అధికారులపై చర్యలు చేపట్టాలి'

**పాడేరు రూరల్, జనవరి 25 :** గిరిజనుల సంక్షేమానికి ఏర్పాటు చేసిన గిరిజన సహకార సంస్థలో అధికారులు పెద్దఎత్తున ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోక పోవడం తగదని ఏఐటీయూసీ జిల్లా కో-కన్వీనర్ అమర్ విమర్శించారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ 2019 నుంచి రాష్ట్ర ప్రభుత్వం గిరిజన రైతులు పండించే కాఫీ, మిరియాలు తదితర పంటల కొనుగోలుకు కోట్లాది రూపాయలు విడుదల చేస్తుంటే ఆ నిధులను జీసీసీ అధికారులు పెద్ద ఎత్తున దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. జిల్లాలోని కొన్ని బ్రాంచ్‌ల్లో విధులు నిర్వహించే మేనేజర్లు, డీఎం కోట్లాది రూపాయలు అవినీతికి పాల్పడినట్టు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందితే.. ఆటువంటి అధికారులకు షోకాజ్ నోటీసులు ఇచ్చి సరిపెట్టాని దుయ్యబట్టారు. అవినీతి అధికారులపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.